



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలూ తీసుకుని సన్నద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు తెలియజేశారు. శనివారం నాడు విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల నియమావళి ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం, నగదు ఇతర వస్తువులు సరఫరా కాకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలని సూచించార. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు జిల్లాలో ఎన్నికలకు సంబంధించి చేపట్టిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు ధర్మవరం వెంకట్ శివరెడ్డి, పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకృష్ణ మడకశిర గౌరీ శంకర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

అసమ్మతి రాగం..!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయ వేడి జోరందుకుంది. నామినేషన్లకు సమయం ఆసన్నం అవుతుండడంతో అభ్యర్థులు ప్రచారాలను మరింత వేగవంతం చేశారు. గెలుపుకోసం వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. అయితే అభ్యర్థులకు అసమ్మతి సెగ గట్టిగానే తగులుతోంది వైసిపి టిడిపి, రెండు పార్టీల్లోనూ అసమ్మతి జ్వాలలు కన్పిస్తున్నాయి. అభ్యర్థి ఎంపికను నిరసిస్తూ ఇప్పటికే కొందరు ప్రత్యర్థి పార్టీలోకి చేరిపోగా, మరికొందరు చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



- టిడిపి, వైసిపిలో కొనసాగుతున్న అసంతృప్తులు
- రాజీనామాలు చేసి పక్కపార్టీలోకి పయనం
- అసమ్మతి నేతలను బుజ్జగిస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఇందులో 2019 ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి విజయం సాధించింది. హిందూపురంలో బాలకృష్ణ, ఉరవకొండలో పయ్యావుల కేశవ్‌లు ఇద్దరు మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందారు. అనంతపురం, హిందూపురం రెండు పార్లమెంటు స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరగోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమిలో భాగంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం బిజెపికి కేటాయించింది. తక్కిన 13 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు టిడిపి అభ్యర్థులు బరిలోనున్నారు. బిజెపికి కేటాయించిన ధర్మవరం సీటులోనూ స్థానిక మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారయణకు కాదని, స్థానికేతరుడు అయిన సత్యకుమార్‌ను బిజెపి అభ్యర్థిగా నిలిపింది. దీంతో జి.సూర్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దింగేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో బిజెపికి ఆశించినంత సానకూలత లేదు. తక్కిన స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులున్న చోట్ల అసంతృప్తులు కొనసాగుతున్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో దుగ్గపాటి వెంకటప్రాసద్‌కు కేటాయించడం పట్ల మాజీ ఎమ్మెల్యే ప్రభకర్ చౌదరి అసంతృప్తితోనున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అమిలినేని సురేంద్రబాబుకు టిడిపి టిక్కెట్టు ఖరారు చేసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మాదినేని ఉమామహేశ్వరనాయుడు వైసిపిలో చేరారు. గుంతకల్లు టిక్కెట్టు గుమ్మనూరు జయరాంకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ మద్దతుదారులు సహకరించే పరిస్థితి కన్పించడం లేదు. మడకశిరలో డాక్టర్ సునీల్‌కుమార్‌కు కేటాయించడంపై కొంత మంది టిడిపి మద్దతుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక హిందూపురం ఎంపి టిక్కెట్టు దక్కకపోవడంతో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప పార్టీకి రాజీనామ చేసి వైసిపిలో చేరుతానని ప్రకటించారు.

వైసిపిలోనూ అసంతృప్తులు

అధికార వైసిపిలోనూ అసంతృప్తులు కొనసాగుతూనే ఉన్నాయి. శింగనమల అభ్యర్థి వీరాంజినయులును మార్చాలని కొంత మంది వైసిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఉన్న మహమ్మద్ ఇక్బాల్‌ను తొలగించి దీపికను నియమించారు. దీంతో మహమ్మద్ ఇక్బాల్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. ధర్మవరంలో చేనేత నాయకుడు గిర్రాజు వైసిపికి రాజీనామా చేశారు. ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ తాజాగా పార్టీకి రాజీనామా చేశారు. అనంతపురం అర్బన్‌లో అసంతృప్తులు అధికంగానున్నారు. తాజాగా నలుగురు కార్పొరేటర్లు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. కదిరి వైసిపిలోనూ పెద్ద ఎత్తునే అసమ్మతి కన్పిస్తోంది. శనివారం నాడు తనకల్లు మార్కెట్ యార్డు ఛైర్మన్, నంబులపూలకుంటా మాజీ ఎంపిపిలు వైసిపికి రాజీనామా చేశారు.

ఎన్నికల పూర్తి బాధ్యత సెక్టోరియల్ అధికారులదే : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బత్తలపల్లి

సార్వత్రిక ఎన్నికల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యత అని ఆర్‌డిఒ వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు చెందిన సెక్టోరియల్ అధికారులు, సూపర్వైజర్లు, రూట్ ఆఫీసర్లు, బిఎల్‌లు, పోస్టల్ బ్యాలెట్ స్టాఫ్‌తో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆర్‌డిఒతో పాటు తహశీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపిడిఒ శివనాగప్రసాద్ హాజరయ్యారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడూ నిర్భయంగా ఓటు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమీషన్ సెక్టోరియల్ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్ కల్పించిందన్నారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఈవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేంత వరకూ సెక్టార్ అధికారులదే పూర్తి బాధ్యత అన్నారు. ఎవరు ఏ ఏ విధులు నిర్వహించాలనే ఆంశాలను వివరించారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టిందన్నారు. అలాంటి వారిని గుర్తించి పూర్తి వివరాలు పంపుతామన్నారు.

ఇంటింటికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ముదిగుబ్బ : ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం మండలంలోని నక్కలపల్లి, దొరిగల్లు క్వార్టర్స్, నాగలగుబ్బ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించి మరోమారు వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి.నారాయణరెడ్డి, ఉప సర్పంచి అంజి, చంద్ర, గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి-రొళ్ల

కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉమ్మడి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్ పేర్కొన్నారు. వారు శనివారం పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్.గౌడప్ప ఆధ్వర్యంలో మండలంలోని హొట్టేబెట్ట గ్రామం నుంచి ఎనికల ప్రచారం ప్రారంభించారు. స్థానిక మారెమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచారంలో భాగం గా పలు గ్రామాల్లో వైసిపి, టిడిపి నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి రఘువీరా పార్టీ కండు వా వేసి ఆహ్వానించారు. రఘువీరా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంతో పాటు నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సుధాకర్‌ను గెలిపిం చాలని కోరారు. హొట్టేబెట్టలో వైసిపి ముఖ్య నాయకుడు నాగేంద్ర, కల్లురొప్పంలో టిడిపి నేత దాసప్ప, వైసిపి నుంచి గోవిందప్ప, చంద్ర, మారెన్న, రామన్న, కొత్తపాల్యం నాగేంద్ర, రొళ్ల గొల్లహట్టిలో కెంపే గౌడ, టిడిపి నుంచి రత్నగిరి మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, మారెన్న, కొడగారిగుట్ట హనుమంత రాయప్ప, వెంకటేష్, డ్రైవర్ శ్రీరామప్ప, బేల్దారి ప్రభాకర్, గుజ్జప్ప, ఈరలింగప్ప నాగరాజు, అగ్రహారం లో టిడిపి నుంచి సన్నకృష్ణగౌడ, గుజ్జప్ప, మల్లసముద్రంలో వైసిపి నుంచి శ్రీరంగప్ప, టిడిపి నుంచి తిప్పేస్వామి, మల్లినమడుగు ఎల్ఐసి ఏజెంట్ నాగరాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రఘువీరారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతన్న కుటుంబాలు



ర్యాలీగా హిందూపురం వస్తున్న బాలకృష్ణ

హిందూపురానికి బాలకృష్ణ

నాయకులు, కార్యకర్తల ఘనస్వాగతం

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటన అనంతరం శనివారం మొదటి సారిగా నందమూరి బాలకృష్ణ హిందూపురం విచ్చేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సూగూరు ఆంజనేయ స్వామి దేవస్థానం చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రచార రథంపై ఎమ్మెల్యే బాలకష్ణ పుర ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనతో కలిసి ద్విచక్ర వాహనంలో బెంగళూరు రోడ్డు, మెయిన్ బజార్, అంబేద్కర్ సర్కిల్, గురునాథ్, తెలుగు తల్లి సర్కిల్ మీదుగా బాలకష్ణ నివాసం వరకు వేలాది మందితో ద్విచక్ర వాహన ర్యాలీగా నివాసం చేరుకున్నారు. బాలయ్యను చూసేందుకు ప్రజలు రోడ్డుపక్కన పెద్ద ఎత్తున నిల్చొన్నారు. మహిళలు జై బాలయ్య.. జై బాలయ్య అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మూడు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



'ఉపాధి' కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-మడకశిర

మండే ఎండలో పొట్టకూటి కోసం కాయ కష్టం చేసిన ఉపాధి కూలీలకు 9 వారాలుగా బకాయిలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ చట్టం కూలీలకు రూ. 40 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయన్నారు. నిధులు దారి మళ్లించి అస్మదీయ కాంట్రాక్టర్లు, సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు వేల కోట్ల రూపాయలు చెల్లిస్తున్న సిఎం జగన్‌కు నిరుపేద కూలీల ఆకలి తీర్చడానికి మాత్రం మనసు రావడం లేదని ప్రశ్నించారు. జనవరి 28వ తేదీ నుంచి కూలీల ఖాతాల్లోకి వేతనాలు జమ కాకపోవడంతో వేల సంఖ్యలో కూలీలు వలసపాట పట్టారన్నారు. వేసవిలో రోజుకు సగటున 40,000 మంది కూలీలు పనులకు వెళ్లాల్సి ఉండగా ప్రస్తుతం 20వేలకు మించడం లేదన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఉపాధి కార్మికులకు తక్షణమే పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను ఉగాది పండుగలోపే వారి ఖాతాలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసిపికి షాక్..!

- పలు ప్రాంతాల్లో పార్టీకి నేతల గుడ్‌బై
- శింగనమలలో మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ముదిగుబ్బలో ఎంపిపి తదితరులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపికి పెద్ద షాక్ తగిలింది. పలు ప్రాంతాల్లో ఆ పార్టీ మఖ్య నేతలు వైసికి గుడ్‌బై చెప్పారు. శింగనమలలో మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ముదిగుబ్బలో ఎంపిపి, తనకల్లులో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అధికార పార్టీలో తమకు గుర్తింపు లేకపోవడం వల్లనే పార్టీని వీడుతున్నట్లు రాజీనామా చేసిన నాయకులు ప్రకటించారు.



యామినీబాల

మాజీ ఎమ్మెల్యే యామినిబాల...

నార్పల : అనంతపురం జిల్లా శింగనమల మాజీ ఎమ్మెల్యే వైసిపికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె శనివారం నాడు అనంతపురం నుంచి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. వైసిపి శింగనమల టికెట్ వ్యవహారంపై గత నెల రోజులుగా తీవ్ర అసమ్మతి నెలకొంది. వీరాంజినేయులకు టికెట్ ఇవ్వడాన్ని వైసిపి అసమ్మతి నేతలు నిరసిస్తున్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా అభ్యర్థిని మార్చకపోవడంతో అసమ్మతి నేతలు ఇప్పటికే రాజీనామా చేస్తామని ప్రకటించారు. తాజాగా యామినీబాల ఆపార్టీకి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికొందరు వైసిపి నాయకులు శింగనమల నియోజకవర్గంలో ఆ పార్టీకి రాజీనామాలు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్...

ముదిగుబ్బ : ముదిగుబ్బ వైసిపి నాయకుడు, ఎంపిపి ఆదినారాయణ యాదవ్ వైసిపిని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన తన నివాసంలో శనివారం నాడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతం, యువతకు మంచి చేయాలన్న ఆశయంతో వైసిపిలో చేరానని తెలియజేశారు. ఎంపిపిగా తాను బాధ్యతలు చేపట్టినా వైసిపిలోని కొందరు స్వార్ధ రాజకీయ నాయకుల కుట్రలు, కుతంత్రాలను జీర్ణించుకోలేక పోయాయనన్నారు. ఆ నాయకులు అభివద్ధి నిరోధక చర్యలకు పాల్పడడంతో అక్కడ ఉండలేకే పార్టీకి రాజీనామా చేశానని తెలియజేశారు. తాను వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివద్ధికి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఎంతో కషి చేశానని తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా తన వ్యాపారాలు వదులుకుని ప్రజలకు సేవ చేయడానికి వచ్చానన్నారు. మండలంలో కొందరు దుష్టశక్తులుగా మారి ఈ ప్రాంతం అభివద్ధి, తన ఉన్నతికి ఆటంకాలు కల్పించారన్నారు. ప్రజలకు ఎలాంటి మేలు చేయలేనని భావించి గత్యంతరం లేని స్థితిలో రాజీనామా చేస్తున్నట్ల తెలియజేశారు. త్వరలో భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట మాజీ ఎంపీపీ...

కదిరి టౌన్ : నంబులపూలకుంట మండల మాజీ ఎంపిపి హనుమంతరెడ్డి టిడిపిలో చేరారు. కదిరి టిడిపి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన టిడిపిలో చేరారు. నంబులపులాకుంట మండలం మరికందిన్నె పంచాయతీకి చెందిన హనుమంతు రెడ్డి గతంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. తిరిగి ఆయన తన అనుచరులతో కలిసి సొంతగూటికి చేరారు. తనతోపాటు ముస్తఫా, లక్ష్మీనరసింహ, వెంకటప్ప, ముసలయ్య తదితరులు టిడిపిలో చేరారు. కందికుంట విసయానికి శక్తివంచన లేకండా కృషి చేస్తానంటూ హనుమంతరెడ్డి తెలియజేశారు.

తనకల్లు మార్కెట్‌యార్డు ఛైర్మన్...



ఈశ్వర్‌రెడ్డి

తనకల్లు : మండల పరిధిలోని చీకటి మానిపల్లి, గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, తనకల్లు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఎన్.ఈశ్వర్ రెడ్డి వైసిపిని వీడారు. శనివారం నాడు వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తు న్నట్లు ప్రక టించారు. గతంలో ఈయన భార్య స్వర్ణలత తెలుగుదేశం పార్టీ తరపున జెడ్పీటీసీగా పని చేశారు. తరవాత మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో వైసిపిలో చేరారు. ప్రస్తుతం ఆపార్టీకి రాజీనామా చేసి తిరిగి టిడిపిలోకి వెళ్లనున్నారు. ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ కదిరి నియోజకవర్గ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు.



ముదిగబ్బలో విలేకరులతో మాట్లాడుతున్న ఆదినారాయణయాదవ్



కందికుంట సమక్షంలో టిడిపిలో చేరుతున్న హనుమంతరెడ్డి

టిడిపి నాయకుల ప్రచారం

గాండ్లపెంట : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారం చేపట్టాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బసిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని వెలిచెనుల, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్, ఎంపిగా బికె పార్ధసారధిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొండకమర్ల గ్రామపంచాయతీలో టిడిపి నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ జాకీర్ అహ్మద్, ఇడుగట్టు ఆంజనేయులు, సురేష్, భూపతి శ్రీనివాసులు, భూపతి విజయ్, భాస్కర్ భూపతి, రమేష్ పాల్గొన్నారు.



ఓబుళదేవర చెరువులో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని విద్యాశాఖ అధికారులు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బాబావలి డిమెండ్ చేశారు. శనివారం పట్టణంలోని బిసి వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు దోపిడీ ప్రారంభించి, 2024-25 విద్యా సంవత్సరం ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికి వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. లక్షలాది రూపాయాలను ఫీజుల రూపంలో తీసుకుంటూ తల్లిదండ్రుల నుంచి దోపిడీ చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, జస్వంత్, పవన్, ఉదయ్, హేమంత్, సంతోష్, సురేష్, ధనుష్, తిరుమలేష్, రఘు, కిరణ్ పాల్గొన్నారు.



విద్యా సంస్థల దోపిడీపై మద్రించిన కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిల్లుల జాప్యంపై విచారణ

నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటాం - జిల్లా ఆడిట్ ఆధికారి వెంకట శివారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో బిల్లుల జాప్యంపై గుత్తేదారులు ఆందోళన కార్యక్రమాలు, బిల్లుల జాప్యానికి కారణాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనాలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి జిల్లా ఆడిట్ అధికారి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం జిల్లా ఆడిట్ అధికారి వెంకట శివా రెడ్డి, సహాయ ఆడిట్ అధికారులతో కలిసి విచారణ జరిపారు. బిల్లులు ఎప్పుడు సిఎఫ్ఎంఎస్‌లో పొందుపరిచారు. ఎన్ని పనులకు సంబందించిన బిల్లులు ఉన్నాయి. తదితర విషయాలను సమగ్రంగ పరిశీలన చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో గుత్తేదారులతో జరిగిన సంఘటనపై విచారణ చేశారు. ఈ సందర్భంగా గుత్తేదారులు పురపాలక సంఘంలో 15 మంది గుత్తేదారులు గత 8 నెలల కాలంగా అప్పులు చేసి దాదాపు రూ.3కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నప్పటికి అకౌంట్స్ విభాగం వారు ఒకరిపై ఒకరు వేసుకుంటు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరకుపోయామని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లో బిల్లులు మంజురైనా ఇక్కడ మాత్రం ప్రీ ఆడిట్ అధికారి రవి శంకర్ నిర్లక్ష్యం వల్ల అందరం రోడ్డున పడ్డామన్నారు. అనంతరం జిల్లా ఆడిట్ ఆధికారి వెంకట శివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘంలో జరిగిన బిల్లుల జాప్యంపై సమగ్రంగా విచారణ జరిపి, నివేదికను ఉన్నాతాధికారులకు అందజేస్తామన్నారు. ప్రీ ఆడిట్ అధికారుల నిర్లక్ష్యం అని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



గుత్తేదారులతో మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ అధికారి శివారెడ్డి



స్వాధీనం చేసుకున్న నగదుతో సిఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి లోకన్న

రూ. 92 వేల నగదు స్వాధీనం

ధర్మవరం టౌన్ : ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ. 92వేలు స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి లోకన్న తెలిపారు. సిఐ శివాజిరావు స్థానిక కళాజ్యోతి సర్కిల్లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని కేశవనగర్కు చెందిన వేణుగోపాల్ వద్ద రూ. 92 వేలు ఉండటాన్ని గుర్తించారు. అందుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు.

24 నుంచి వేసవి సెలవులు : డిఇఒ

పుట్టపర్తి : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకూ ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని డిఇఒ మీనాక్షి తెలిపారు. ఈ మేరకు పాఠశాల కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. జూన్ 12వ తేదీ పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని డిఇఒ తెలిపారు.



విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

జంపింగ్ రోప్లో విద్యార్థికి గోల్డ్ మెడల్

చిలమత్తూరు : రోప్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని శ్రీసాయి యేసు విద్యానికేతన్లో 4వ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్నాయక్ ఎపి తరఫున ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్మెడల్ సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు బాలాజీరెడ్డి తెలిపారు. విష్ణువర్ధన్నాయక్ను ఇన్ఛార్జి ఎంఇఒ నాగరాజానాయక్, మిథున్ టెక్నాలజీస్ భాస్కర్రెడ్డి అభినందించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు వితరణ

ఓబులదేవరచెరువు : మండలంలోని గాజులవారిపల్లిలో ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి శనివారం మండలంలోని నల్లగొండ్రాయునిపల్లికి చెందిన రెడ్డిపల్లి మహేశ్వర్రెడ్డి, గీతా దంపతులు రూ. 10 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. వారి ఏకైక కుమారుడు రిక్విత్ తొలి పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతికి వాటిని అందజేశారు. వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పుట్టినరోజు కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమానికి భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామని మహేశ్వర్రెడ్డి, గీత దంపతులు తెలిపారు.

సాయి భక్తుల అష్టోత్తర శతనామావళి

పుట్టపర్తి క్రైమ్ : ఆధ్యాత్మిక కేంద్రమైన ప్రశాంతి నిలయంలో శనివారం ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పర్తియాత్రలో భాగంగా ఝార్ఖండ్ భక్తులు పుట్టపర్తికి ఇచ్చే శారు. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ప్రశాంత్ నిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో వారు అష్టోత్తర శతమానామావళి నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. ఝార్ఖండ్ సత్యసాయి సేవాదళ్ సభ్యులు మాట్లాడుతూ ఏటా సత్యసాయి దర్శనార్థం పర్తియాత్రగా 2వేల మంది ఇక్కడికి వస్తామన్నారు. కార్యక్రమంలో దేశ, విదేశీ భక్తులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

టిడిపిలో బుడగ జంగాల కుటుంబాలు చేరిక

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన 70 బుడగ జంగాల కుటుంబాలు శనివారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వారికి కదిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టాక చేతి వృత్తిదారులు, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో చీకటి నింపిందన్నారు. ఇన్ని రోజులూ జగన్ మాయలో పడి జీవితాలను అంధకారంలో గడిపామని, ఇప్పుడు మేల్కొని టిడిపిలో చేరామన్నారు. కందికుంట గెలుపు కోసం చిత్తశుద్ధితో పని చేస్తామని, టిడిపి అధికారం చేపట్టడం ఖాయమన్నారు.



కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న బుడగ జంగాల కుటుంబ సభ్యులు

టిడిపి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

డా. సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి డా. సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'శంఖారావం'లో మరింత వేగవంతం పెంచాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజే యాలన్నారు. మడకశిర నియోజకవర్గం, హిందూపురం పార్లమెంట్ స్థానాల్లో పసుపు జెండా ఎగరాల న్నారు. వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమే అన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించగల ఏకైక నాయకుడు చంద్రబాబే అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి ఎమ్మెల్యేగా సునీల్‌కుమార్, ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపిద్దామని కోరారు. కార్యక్రమంలో అశ్వర్థామప్ప, ఆదినారాయణ, బొజ్జప్ప, దేవ్లానాయక్, రాజగోపాల్, ఎస్ఎం.కృష్ణప్ప, రమేష్, మంజునాథ్, నరేష్, మాధవరాజు, రంగనాథ్, పుల్లయ్యచౌదరి, గణపతి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' మహిళలకు వరం అని మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ తెలిపారు. వారు అమరాపురం మం డలంలో ఎన్నికల ప్రచారం చేపట్టగా ప్రతి గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపి అభ్యర్థులను గెలిపించా లని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, కృష్ణమూర్తి, ఉగ్రనరసింహా, విఎం పాండురంగప్ప, బిఎల్ఆర్.వీరకేతరాయ, అశ్వర్థామప్ప, బొజ్జప్ప, ఆదినారాయణ, ప్రసాద్, దాదు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్

అభివృద్ధి లేకుండా ఐదేళ్లు గడిపేశారు : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా ఐదేళ్లు గడిపేశారని, తద్వారా అభివృద్ధిలో ఎపి పదేళ్లు వెనక్కు వెళ్లిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పుట్టపర్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డితో కలిసి మండలంలోని మైలేపల్లి, తిరుమల దేవరపల్లి, కనిశెట్టిపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. వారికి ముందుగా టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వైసిపి పాలన లో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందని, సిఎం జగన్ ఎపిని అప్పుల పాలు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసులు, వాణి, లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, రఘుపతి, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, నాగేంద్రప్రసాద్, గాజుల చంద్ర, బోయరాజు, ఎస్.వంశీ కిషోర్, కిరణ్, రాహుల్, వైవి మురళి, శంకర్, పెద్దన్న, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న పల్లె రఘునాథరెడ్డి, పల్లె సింధూర, వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామికి నివాళి

ప్రజాశక్తి-పరిగి

మాజీ ఎమ్మెల్యే, సేవా మందిర్ సంస్థ మాజీ అధ్యక్షుడు తిప్పేస్వామి జయంతి సందర్భంగా శనివారం సంస్థ అధ్యక్షుడు కెటి.శ్రీధర్ ఆధ్వర్యంలో సేవా మందిర్ విద్యాసంస్థల్లో తిప్పేస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీధర్ మాట్లాడుతూ సంస్థను అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇటు సేవకుడిగా, అటు ప్రజాప్రతినిధిగా ఎన్నో సేవలందించా రన్నారు. హిందూపురాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా నాటి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడు తిప్పేస్వామి అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సవిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సేవామందిర్ సంస్థ అధ్యక్షులు కెటి.శ్రీధర్

'బిసిలను మోసం చేసిన వైసిపిని ఓడించండి' : టిడిపి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండా ఉత్తుత్త బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలను మోసం చేసిన సిఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పాలని టిడిపి నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని చౌడేశ్వరి కళ్యాణ మండపం లో శనివారం నిర్వహించిన 'జయహో బిసి' సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. కేవలం వైసిపి నాయకుల జేబులు నింపుకోవడానికి సిఎం జగన్ బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ఏకైక పార్టీ టిడిపి అన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఖాదర్‌బాదర్, నాగప్ప, పట్టణ అధ్యక్షులు డైమాండ్ ఇర్ఫాన్, పివి.పవన్ కుమార్‌రెడ్డి, అహమ్మద్ అలీ, మనోహర్‌నాయుడు, నాగప్ప, శంకర, గంగరాజు, బి.శ్రీ రాములు, వీరభద్రం, బిల్డర్ రమణ, సోంపాల్యం నాగభూషణం, గంగులప్ప, పీట్ల రమణమ్మ, సుధాకర్, భాస్కర్, ఖాదర్‌బాషా, కౌన్సిలర్లు సావిత్రమ్మ, బహుద్దీన్, రంగారెడ్డి, క్రిష్టప్ప, మహబూబ్ బాషా పాల్గొన్నారు.




జయహో బిసి సభలో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌రెడ్డి

రక్తహీనత, వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్థానిక పిహెచ్‌సి సిబ్బంది శనివారం మండలంలోని జగరాజుపల్లి కస్తూర్బా పాఠశాలలో జిల్లా సిడి, ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్తహీనత, వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీలైనంత వరకూ ప్రయాణాలు కానీ, పనులు కానీ ఉదయం 10 గంటలలోపు మధ్యాహ్నం 3 గంటల తరువాత ఉండేటట్లు చూసుకోవాల న్నారు. కాటన్ దుస్తులు ధరించాలని, ప్రయాణంలో చెప్పులు, గొడుగు, నీరు తప్పనిసరిగా తీసుకెళ్లాల న్నారు. తరచూ నీరు, టెంకాయ నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. అస్వస్థకు గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ఓ నాగసుప్రజ, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, పాఠశాల అరోగ్య కార్యకర్త జయమ్మ, ఎడ్యుకేటర్లు శ్రావణి, నిశిత, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.



కెజిబివిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వైసిపిని విమర్శించే నైతిక హక్కు లేదు

ముదిగుబ్బ : ఎంపిపి ఆదినారాయణ యాదవ్‌కు వైసిపిని విమర్శించే నైతిక హక్కు లేదని, తన నిజాయితీని చాటుకోవాలంటే వెంటనే పార్టీ సభ్యత్వం, పదవికి రాజీనామా చేయాలని స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ఎటువంటి రాజకీయ అనుభవం, ప్రజలతో సంబంధాలు లేని, ఎక్కడో వ్యాపారా లు చేసుకుంటున్న ఆదినారాయణయాదవ్‌ను వైసిపి ఎంపిపిని చేసిందన్నారు. కన్నతల్లి లాంటి పార్టీని ఆయన విమర్శించడం తగదన్నారు. మండలంలో ఎలాంటి పనులు చేపట్టకుండా అభివృద్ధి నిరోధక చర్యలకు పాల్పడడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ పదవిని మాత్రమే అనుభవించడం సిగ్గుచేటు అన్నారు.

జాతీయ అంధత్వ నివారణ వారోత్సవాలు

ధర్మవరం టౌన్ : 'కంటిని కాపాడండి.. అది మిమ్మల్ని కాపాడుతుంది' అని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న మధు కంటి వైద్యశాలలో మంగళవారం జాతీయ అంధత్వ నివారణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనిషి జీవన విధానంలో కంటిచూపు కీలక పాత్ర వహిస్తుందన్నారు. కంటి సంరక్షణ అవసరాన్ని సమాజానికి తెలియజేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు. సమాజ అవగాహన ద్వారానే కంటి సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదీ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తారు. ఈ నెల 9వ తేదీ పండుగ సెలవు రావడంతో శనివారం ఆసుపత్రిలో 140 మంది గర్భిణులకు, ఆసుపత్రి సిబ్బందికి భోజనం ఏర్పాటు చేసినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రవిశేఖర్‌రెడ్డి, రవి, రామాంజనేయులు, మంజునాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు

ముదిగుబ్బ : మండలంలోని ఇందుకూరు, దొరిగల్లు గ్రామాల్లో శనివారం టౌన్ సిఐ యతీంద్ర ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల వేళ ఓటర్లందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా భరోసా కల్పిస్తూ రహదారి పొడవునా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. కవాతులో సాయుధ బలగాలతో పాటు ముదిగుబ్బ పోలీసులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి రూరల్ : మండలంలోని కప్పలబండ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బావమరిది రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయ కులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి పరిశీలకులు మాధవరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ నర్సారెడ్డి, ఎంపిపి రమణారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, గంగాద్రి, ఫొటో సాయి, మురళి, కన్యాకుమారి, నాయకులు శేఖర్, నరసప్ప, ఎర్రప్ప, నారాయణస్వామి, రవి, కరుణాకర్, నాగప్ప, రాజప్ప, మార్లపల్లి శేషాద్రి పాల్గొన్నారు.



కప్పలబండలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

జగన్‌తోనే పేదరిక నిర్మూలన సాధ్యం

ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సంక్షేమ పథకాలతో సామాన్యుల జీవన ప్రమాణ స్థాయిని పెంచిన సిఎం జగన్‌తోనే పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యమని, ఎన్నికల్లో వైసిపికి మద్దతు తెలపాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామి రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శనివారం 29వ వార్డు ఇన్‌ఛార్జి, పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో 305 కుటుంబాలు, 22వ వార్డు ఇన్‌ఛార్జి కుమారస్వామి ఆధ్వర్యంలో 60కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలోకి చేరాయి. చేరిన వారిలో అంజి, వెంకటస్వామి, ఇబ్రహీంఅలీ, నాగరాజు, చంద్రశేఖర్, రామాంజనేయులు, పార్థసారధి, నారాయణస్వామి, బయన్న, సూర్యప్రతాప్, సుధాకర్, వెంకటేష్‌తో పాటు మొత్తం 365 కుటుంబాలకు ఎమ్మెల్యే కండువాల వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తున్న జగన్‌ను మరోమారు సిఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నీలూరి ప్రకాష్, బడన్నపల్లి కేశవరెడి, పరంధామరెడ్డి, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన కుటుంబాలు

వైసిపి హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ప్రజాశక్తి-మడకశిర

సిఎం జగన్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీలోని ఎఆర్ రొప్పం, హెచ్‌ఆర్ పాళ్యం, గౌరీపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా ఆయ నకు స్థానిక పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆయన మాట్లాడుతూ పేదలు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన జగన్‌ను మరోమారు సిఎం చేసుకోవాలన్నారు. చంద్రబాబు పాలనలో విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధికి తూట్లు పొడిచారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిందన్నారు. అవన్నీ కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.



వైసిపి అభ్యర్థి ఈరలక్కప్పకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

సాయి అమూల్య విల్లాస్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సమీపంలో కర్ణాటక నాగేపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న సాయి అమూల్య విల్లాస్‌లో శనివారం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు భూమిపూజ చేశారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రదీప్, రమేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాయి అమూల్య విల్లాస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సాయి రమేష్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సభ్యులు రమేష్, ప్రదీప్ మాట్లాడుతూ పుట్టపర్తికి అతి సమీపంలో ఆహ్లాదకర మైన వాతావరణంలో వినియోగదారులకు అందుబాటు ధరలో 180 విల్లాలను నిర్మించ తలపెట్టామన్నారు. గతంలో ఎన్నో వెంచర్లు వేసి విల్లాలు నిర్మించి వినియోగదారులకు చేరువయ్యామన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రజల మన్ననలు పొందుతామని తెలిపారు. జబర్దస్త్ టీం సభ్యులు రోహిణి, ఆటో రామ్‌ప్రసాద్, శాంతి స్వరూప్, దొరబాబు వారి ఆట, పాటలతో సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు కొండమ రాజు, లాయర్ హరికృష్ణ, అవుటాల రమణారెడ్డి, రామ్‌లక్ష్మణ్, బిల్డర్లు సాయికృష్ణ, లక్ష్మీపతి, బయన్న, పిసి గంగన్న, సాయి ఆరామం గంగాధర్, రత్నప్ప చౌదరి, పలువురు పుట్టపర్తి ప్రముఖులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.



సాయి అమూల్య విల్లాస్ భూమిపూజలో పాల్గొన్న రత్నాకర్‌రాజు, సాయి రమేష్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సభ్యులు రమేష్, ప్రదీప్

విద్యతోనే సమాజాభివృద్ధి : పరిపూర్ణానంద

ప్రజాశక్తి-హిందూపురం

విద్యాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని.. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు విద్యారంగాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీకంఠాపురం ఝాన్సీ లక్ష్మీబాయి పాఠశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించి మూసివేశారు. విషయం తెలుసుకున్న పరిపూర్ణానంద శనివారం ఆ పాఠశాలను సందర్శించి, పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ విద్యారంగం వెనకబడుతూ, ప్రయివేట్ విద్యారంగం ముందుకెళుతుందన్నారు. సమాజ అభివృద్ధి కోసం రాజకీయ రంగ ప్రవేశం చేశానని, అందులో భాగంగా ఇక్కడి నుంచే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తు న్నానని తెలిపారు. పార్టీ సింబల్‌పై ఎంపిగా పోటీ చేస్తానని, అధిష్టానం మొండి చేయి చూపితే స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తానని తెలిపారు.

రాజీనామాల సీజన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికలు వచ్చాయంటే చాలు.. నేతల హడావుడి మొదలవుతుంది. అధికారం ఎటు వైపు మొగ్గుందో చూసుకుని ఆ వైపునకు ముందుగానే చేరుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోనూ అవే కొనసాగుతున్నాయి. ఈ వారంలో అసంతృప్తులు, అసమ్మత్తులు తారాస్థాయికి చేరాయి. అదే సమయంలో రాజీనామాల పర్వమూ మొదలైంది. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఈవారంలో రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. పార్టీకే కాకుండా ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేశారు. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తప్పించినప్పటి నుంచి ఆయనకు ప్రాధాన్యత లేదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయన టిడిపిలో చేరనున్నట్టు ప్రచారం నడుస్తోంది. అదే సందర్భంలో వైసిపికి రాజీనామీ చేస్తున్నట్టు శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినీబాల కూడా ప్రకటించడం గమనార్హం. 2019లో ఆమెకు టిడిపి టిక్కెట్ ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరారు. అయితే అక్కడా ఎటువంటి ప్రాధాన్యత లేదన్న ఉద్దేశంతో రాజీనామా చేసినట్లు సమాచారం. ఇక ధర్మవరంలోనూ వైసిపి రాజీనామాలు పెరుగుతున్నాయి. చేనేత నాయకుడు గిర్రాజు రాజీనామా చేశారు. ఆ మరుసటి రోజు ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ రాజీనామా చేశారు. ఇక అనంతపురం అర్బన్‌లో ముగ్గురు కార్పొరేటర్లు జయరామ్‌నాయుడుతో పాటు వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరారు. ఇది ఇలాగుంటే టిడిపి నుంచి కూడా ఇప్పటికే ముగ్గురు నేతలు రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు టిడిపికి రాజీనామా చేసి వేసిపిలో చేరారు. కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా టిడిపికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. తాజాగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప కూడా టిడిపిని వీడుతున్నట్టు ప్రకటించారు. ఇలా రెండు వైపుల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఇక నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకుల పార్టీలు మార్పులు కుప్పలు తెప్పలుగా జరుగుతున్నాయి. ఈరోజు ఇక్కడున్నోడు.. రేపటిలోపు కండువ మార్చేస్తున్నారు. వీరిని పట్టుకోవడం.. అలకలు మాన్పడం ఎలాగన్నది అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఓటర్లను కలవడం ఒక ఎత్తయితే బుజ్జగింపులు మరో ఎత్తు అవుతోంది. రాజకీయ పరిణామాలు ఇలాగుంటే ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం అధికార యంత్రాంగాన్ని నివ్వెరపరచింది. ఇకపోతే కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లను బాధ్యతల నుంచి తప్పిస్తూ తీసుకున్న నిర్ణయం జిల్లాలో పెద్ద చర్చనీయాంశం అయింది. ఒకేసారి ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంతో అందరూ అప్రమత్తమయ్యారు. వెంటనే కొత్త అధికారులను నియమించడం వారొచ్చి బాధ్యతలు తీసుకోవడం రెండు రోజుల వ్యవధిలో పూర్తయ్యాయి. కొత్త కలెక్టర్‌గా వినోద్‌కుమార్, ఎస్పీగా అమిత్ బర్దర్‌ను నియమించారు. ఎపి ఎస్పీ బెటాలియన్ నుంచి నియమించడంతో వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంకా మరికొంత మంది డివిజనల్ స్థాయి అధికారుల మార్పులుంటాయని ప్రచారం నడుస్తోంది. జిల్లాలో ఎవరిపై ఈ రకమైన వేటు పడుతుందోనని భయపడుతున్నారు.

రాష్ట్రంలో దరిద్రపు పాలన

కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'రాష్ట్రంలో దరిద్రపు పాలన సాగుతోంది.. మీ మనిషిగా మీ ముందుకొచ్చా.. ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా' అని కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ సిఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. కేంద్రం అవినీతి పరుల ఆగడాలు కట్టిస్తుందన్నారు. ఎపిపై కూడా ప్రత్యేక దృష్టి సారించిందని, త్వరలోనే అవినీతిపరుల జాబితా తయారవుతుం దని, కొందరు జైలుకెళ్లడం ఖాయమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఒక్క రైతుకైనా సాయం చేశారా అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పాడన్నారు. వైసిపి ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి వెళ్లింద న్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షులు జిఎం.శేఖర్, శ్రీనివాసులు, నాయకులు అంబటి సతీశ్‌కుమార్, గుండా పుల్లయ్య, జింకా చంద్రశేఖర్, ఓబులేసు, గోపాల్‌రెడ్డి, భక్తవత్సలం పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బేల్దారికి గాయాలు

ధర్మవరం టౌన్ : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పట్టణంలోని పుట్టపర్తి రహదారిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గూడ్స్ కొట్టాలకు చెందిన లింగమయ్య బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ప్రతి రోజూ లాగే తన ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై తుంపర్తి కాలనీలో ఇంటి నిర్మాణం పనులకు వెళ్తుండగా మార్గమధ్యలో పుట్టపర్తి రహదారిలోని అరిగెల పోతన్న రైస్ మిల్లు వద్ద ఓ ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగమయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. ప్రథమ చికిత్స అనంతరం అతడిని అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మామిడి చెట్లు దగ్ధం

పుట్టపర్తి : కొత్తచెరువు మండలంలోని మైల సముద్రం గ్రామంలో రైతు చలపతికి చెందిన మామిడి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు.. తన పొలంలో మామిడి చెట్లను సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. తీరా కాయలు కాసినప్పుడు కుట్ర పూరితంగా తోటకు నిప్పు పెట్టారని, 40 మామిడి చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయని వాపోయడు. మంటలను త్వరగా ఆర్పడంతో ప్రమాదం తప్పింద న్నారు.